# పడకగది కిటికీ



"ఏవండీ!" "ఏవండీ!" ... "ఏవండీ" మూడుసార్లు గట్టిగా పిలిచినా పలకకపోవడంతో "ఎక్కడున్నారు?" అని విసుక్కుంటూ నీలిమ వంటగదిలోంచి పడగ్గదికి వచ్చి చూసింది.

పడగ్గదికి వున్న కిటికీ తెరిస్తే పక్కింంచి వెనక భాగం అంతా కనిపిస్తూ ఇబ్బందిగా వుంటుందని, తను ఆ కిటికీని ఎప్పుడూ మూసి వుంచుతుంది.

ఈరోజు ఆ కిటికీని తెరిచి ఈ లోకాన్నే మరచి తన్మయంగా చూస్తూ రామారావు!

ఏముందబ్బా! అనుకుంటూ తనూ తొంగిచూసింది. రెండు రోజుల క్రిందట పక్కింటిలో ఒక ఫామిలీ అద్దెకు దిగింది. ఆమెకు 25 ఏళ్ళుంటాయేమో నాతిగట్టు వద్ద పిల్లలిద్దరికీ స్నానాలు చేయిస్తూ వుంది. ఆమెకి 'జొల్లు' వదులుతూ ఈయన. 'చిన్న గొంతుతో ఒకసారి పిలిస్తే చాలు పలికేవారు, ఈ రోజు ఇంత గట్టిగా అరిచినా వినిపించుకోలేదేమిటా?! ... అనుకున్నాను. ఇదన్నమాట సంగతి!' అనుకుంటూ – "ఏవండోయ్" చెవులు చిల్లులు పడేలా పిలిచింది నీలిమ.

ఒక్క క్షణం అదిరిపడి "అదేంటీ అలా అరుస్తావు! ఆ పిల్లలు చూడు ఎంత ముద్దొస్తున్నారో! ఏమిటా గోలగా వుంది పక్కింట్లో అని ఇప్పుడే కిటికీ తెరిచి చూస్తున్నాను అంతలోకి నువ్వొచ్చేశావు" సమర్ధించుకుంటూ రామారావు.

"మీకు మీ అమ్మానాన్నా రాముడి పేరు పెట్టి పెద్ద తప్పు చేశారు. మీకసలు కృష్ణారావని పేరు పెట్టి వుండాల్సింది ..." పళ్ళు నూరుకుంటూ కోపంగా అంది.

"ఛ! ఛ! అలాంటిదేం లేదోయ్! అన్నీ ఊహించుకొంటావు" బుజ్జగిస్తున్నట్టు రామారావు.

ఆరోజుకి మనసుని సమాధానపరుచుకుంది. 'కళ్ళున్నాక మనిషి చూడక మానడు. చూసినంతమాత్రాన ఏమయిందిలే కానీ కథ పాకాన పడకుండా కనిపెట్టి చూస్తుండాలి" అని.

కానీ రాను రానూ రామారావు కిటికీ దగ్గరే పేపరు చదవటం, కిటికీ దగ్గరే ఫైల్సు చూసుకోవడం, పడగ్గదిలోకి వెలుతురు రావడంలేదని కిటికీలు తెరిచే వుంచడం చేస్తున్నాడు.

అదేమంటే సోఫాలో కూర్చుని పేపరు చదివితే నడుం నొప్పిగా వుంటుంది అంటూ ఏవో కుంటి సాకులు చెబుతున్నాడు.

నీలిమకి ఇదంతా చూస్తుంటే ఒళ్ళు మండిపోతుంది. ఏమీ అనలేక మింగాలేక కక్కాలేక అన్నట్లుంది నీలిమ పరిస్థితి. ఇలా రెండు నెలలు గడిచాయి.

ఒకరోజు వంటగదిలో పని ముగించి పడగ్గదికి వస్తుండగా కనబడిందా దృశ్యం.

రామారావు చేతులూపుతూ సైగలు చేస్తున్నాడు. అవతల ఆమె చిర్నవ్వులు చిందిస్తూ వుంది. నీలిమ గుండె రగిలిపోయింది. 'ఇన్నాళ్ళు రామారావు మాత్రమే అనుకున్నాను. ఇపుడు అట్నుంచి కూడా గ్రీన్‌సిగ్నల్ వస్తున్నట్లుంది లాభం లేదు' అనుకుని చిన్నగా దగ్గింది నీలిమ.

ఉలిక్కిపడిన రామారావు గబుక్కున పేపర్లో తల దూర్చి సర్దుకున్నాడు. నీలిమ వున్నంత సేపు చాలా సీరియస్‌గా, దీక్షగా పేపర్ చదువుతూనే వున్నాడు. కిటికీ అవతల ఆమె తన పని తాను చేసుకుని ఇంట్లోకెళ్ళిపోయింది.

అలా నీలిమ వున్నప్పుడు ఒకలాగా లేనప్పుడు ఒకలాగా రామారావు ప్రవర్తించసాగాడు.

ఇదంతా గమనిస్తున్న నీలిమ 'రామారావు చేత కిటికీ మూయించే ఉపాయం ఏదైనా వుందా? ... ' అని ఆలోచనలోపడింది.

ఒకరోజు నీలిమ బుర్రకి మెరుపులా తట్టిందొక ఐడియా! వెంటనే అమలుపరిచింది!!

ఆరోజు సాయంత్రం ఆఫీసు నుంచి వస్తూనే రామారావుకి ఆశ్చర్యం కలిగించే దృశ్యం కళ్ళబడింది. అదేమిటంటే కిటికీ దగ్గర నీలిమ కూర్చుని వుంది. అంతేకాదు ఏకదీక్షగా కిటికీలోంచి పక్కింటివైపే చూస్తుంది. ఏమిటా అని తనూ చూశాడు. అక్కడ పక్కింటతను నీళ్ళు తోడుతున్నాడు. "నీలిమా!" పిలిచాడు. నీలిమ రామారావుని అప్పుడే చూసినట్టుగా "వచ్చేశారా! వచ్చి ఎంతసేపయింది? టైమే తెలీలేదు" అంది.

ఆ తరువాత రామారావుతో బాటు నీలిమ కూడా కిటికీలోంచి చూస్తూ కూర్చోవటం మొదలుపెట్టింది.

అంతేకాకుండా రామారావు ఆఫీసుకెళ్ళిన తర్వాత అమ్మలక్కల ద్వారా పక్కింటివాళ్ళ వివరాలు సేకరించి, రామారావు రాగానే వాళ్ళ

వివరాలు చెప్పినట్టే చెప్పి, "అతను చాలా బాగా మాట్లాడతాడండీ, అన్ని భాషలు బాగా తెలుసునట. అంతేకాదు. చాలా బాగా పాటలు పాడతాడు" అంటూ రామారావు మొఖంలో మారే రంగుల్ని ఏమాత్రం పట్టించుకోకుండా అమాయకంగా చెప్పేది.

ఆ తరువాత తరువాత ఏ సందర్భంలోనయినా పక్కింటివాళ్ళ విషయం వచ్చిందంటే పక్కింటి అతన్ని తెగ పొగిడేస్తుంది. దాంతో రామారావుకి ఏం చేయాలో పాలుబోక మౌనంగా వుంటున్నాడు.

ఒకరాత్రి రామారావు మంచి మూడ్‌లో నీలిమని దగ్గరికి తీసుకోబోతుండగా, రామారావు కోరికని గమనించనట్లే నటించి "ఏమండీ! పక్కింటి అతను భలే హాండ్సమ్‌గా వుంటాడు కదండీ! మంచి పర్సనాలిటీ అతనిది. నిజంగా పక్కింటావిడ అదృష్టవంతురాలే!" అన్నది. కొద్ది క్షణాల నిశ్శబ్దం. రామారావు మనసుకి బలమైన దెబ్బ అది. వెంటనే రామారావు అటుతిరిగి పడుకున్నాడు. 'భర్త తప్పితే పరాయి మగవాడ్ని కలలో తలుచుకోవడానికి కూడా ఇష్టపడని తన నోటి వెంట ఇటువంటి సమయంలో పరాయి మగవాడ్ని పొగడాల్సి వచ్చినందుకు' నీలిమ మనసు రామారావుకన్నా ఎన్నోరెట్లు బాధపడింది.

మామూలుగానే తెల్లవారింది. అన్ని పనులలో హడావుడిగా వున్న నీలిమ ఎందుకో భర్తకోసం పడగ్గదికి వచ్చింది. అక్కడ పడగ్గది కిటికీ మూసేసి వుంది. రామారావు హాల్లో కూర్చుని పేపరు చదువుకుంటున్నాడు.

మళ్ళీ పడగ్గదికి వచ్చి కిటికీ దగ్గర నిలిచింది. 'భార్య మాత్రం పరాయిమగాడ్ని కన్నెత్తి చూడకూడదనే మెంటాలిటీ గల మగవాళ్ళున్నంత వరకూ నీలిమలాంటి భార్యలకి మరేం భయం అక్కర్లేదంటూ' తనని చూసి పడగ్గది కిటికీ పగలబడి నవ్వినట్లనిపించింది నీలిమకి.

వెనువెంటనే తను కూడా మనసారా పగలబడి నవ్వేసింది నీలిమ.




శ్రీమతి
ఉల్లిపూరి
భవానీ విజయ్